ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 139 | పేజీలు: 6 | వెల: రూ.3/- | శుక్రవారం 28 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# మీర్ ఆలమ్ చెరువుపై నిర్మిస్తున్న
# ఐకానిక్ బ్రిడ్జి పనులను పరిశీలించిన సీఎం

## మీర్ ఆలమ్ చెరువు మధ్యలో ఉన్న ఐల్యాండ్‌లను అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు
## చెరువులో మురుగు నీరు కలవకుండ చర్యలు తీసుకోవాలి
## చింతల్ మెట్ నుంచి కిషన్ బాగ్ వరకు రోడ్డు ను విస్తరించాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


మీర్ ఆలమ్ చెరువు మీదుగా నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం గురించి ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని అడిగి తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి


భారీ క్రేన్ పై నుంచి మీర్ ఆలమ్ చెరువు ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి


మీర్ ఆలమ్ చెరువు లో ఎక్కడెక్కడ ఎలాంటి పనులు చేపడుతున్నామో వివరిస్తున్న ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ వి నరసింహ రెడ్డి, గౌతమి లు


మీర్ ఆలమ్ చెరువు ను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి

**బుద్వేల్ , ఆగస్టు 27 (ప్రభాత ఉదయం)**

చింతల్ మెట్ మీర్ ఆలమ్ పార్కు నుంచి మీర్ ఆలమ్ చెరువు మీదుగా శాస్త్రిపురం చౌరస్తా వరకు రూ.430 కోట్లతో నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం పనులను గురువారం ఉదయం 8:30 గంటలకు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ ఐకానిక్ బ్రిడ్జి పనులను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్) ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి తో పాటు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ వి నరసింహ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి, ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి లు ఉన్నారు. మీర్ ఆలమ్ చెరువు మధ్యలో నుంచి 58 పిల్లర్ లతో ఐకానిక్ బ్రిడ్జి ని నిర్మిస్తుండగా ఇప్పటికే 33 పిల్లర్ లకు ఫౌండేషన్ పనులు ప్రారంభమయ్యాయి. నాలుగు నెలలుగా ఐకానిక్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. ఒక గంట పదిహేను నిమిషాల పాటు మీర్ ఆలమ్ చెరువు వద్ద ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం గురించి అధికారులు వివరించారు. బ్రిడ్జి నిర్మాణం గురించి ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం గురించి అధికారులు ఇ వి నరసింహ రెడ్డి, గౌతమి లు ముఖ్యమంత్రి కి కూలంకుషంగా వివరించారు.

**మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

మీర్ ఆలమ్ చెరువు మీదుగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేస్తున్న నేపధ్యం లో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. చెరువు లోకి మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు, గుర్రపు డెక్క పెరగ కుండ చూడటం తో పాటు ఎప్పటి కప్పుడు తొలగించాలన్నారు. మూసి లో ఉన్న ఐ ల్యాండ్ లను అభివృద్ధి చేసి గార్డెనింగ్, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అక్కడ థీమ్ పార్కులను అభివృద్ధి చేయాలన్నారు.

**చింతల్ మెట్ నుంచి కిషన్ బాగ్ రోడ్డు ను విస్తరించాలి:**

చింతల్ మెట్ నుంచి కిషన్ బాగ్ వరకు ఉన్న రహదారి ని విస్తరించాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ గా కూడా ఉన్న సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని ముఖ్యమంత్రి ఆదేశించారు. శంషాబాద్ లో గల రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కు సమీపంలో ఉన్న మీర్ ఆలమ్ చెరువు ను పర్యాటక ప్రాంతం గా అభివృద్ధి చేస్తే ఇక్కడికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అనుకున్న గడువు లోగా మీర్ ఆలమ్ చెరువు పై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఫైర్ డిపార్ట్ మెంట్ కు చెందిన భారీ క్రేన్ పై ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి మీర్ ఆలమ్ చెరువు ను, చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్య రాజ్ తదితరులు ఉన్నారు



# కాంగ్రెస్‌లో వ్యక్తిగత కోపాలకు తావు లేదు: మహేశ్ గౌడ్

## ఎఐసిసి పరిధిలో కొండా సురేఖ వ్యవహారం
## అధిష్టానం తీసుకునే నిర్ణయం అందరికీ శిరోధార్యం

**నిజామాబాద్, ఆగస్టు 27(ప్రభాత ఉదయం)**

మంత్రి కొండా సురేఖ అంశం కాంగ్రెస్ పార్టీలో తీవ్ర దుమారాన్ని రేపుతున్న విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కూతురు సుస్మిత తీవ్ర వ్యాఖ్యలు చేయడం.. దీనిపై సురేఖకు క్రమశిక్షణ కమిటీ నోటీసులు ఇవ్వగా.. కుమార్తె కామెంట్స్‌కు తనను బాధ్యురాలిని చేయొద్దంటూ మంత్రి వివరణ ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. తాజాగా, ఈ వ్యవహారంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. కొండా సురేఖ ఎపిసోడ్ ఏఐసీసీ పరిధిలో ఉందన్నారు. క్రమశిక్షణ కమిటీ నివేదికను ఏఐసీసీకి పంపించడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఉందని, అయితే అది క్రమశిక్షణకు లోబడి ఉండాలన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లోనే స్వేచ్ఛ ఎక్కువన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎవరిపైనా కోపాలు, కక్షలు ఉండవని.. కొండా మురళి తనతో ఎలాంటి సంప్రదింపులు జరుపలేదని మహేశ్ గౌడ్ స్పష్టం చేశారు. అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. స్వాగతిస్తామని చెప్పారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చినంత ప్రాధాన్యం ఏ పార్టీ ఇవ్వలేదన్నారు. ఇకపోతే తెలంగాణకు రావాల్సిన నీటి వాటాలో రాజీ ఉండదని తేల్చిచెప్పారు. తెలంగాణకు ఏ రకంగానూ అన్యాయం జరగకుండా చూసే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. తనకు సర్ నోటీసు అందిందని.. వివరాలు సమర్పిస్తానని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



# గవర్నర్‌కు సిఎం పరామర్శ

**హైదరాబాద్, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం)**

అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సిఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలసి వెళ్లిన సిఎం గవర్నర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసారు. ఈ మేరకు గవర్నర్ ఆరోగ్యంపై వైద్యులను ఆరా తీసారు.

# యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు
# మరో 25 ఏళ్లపాటు యధావిధిగా కొనసాగాలి

## ప్రస్తుత సీట్లకు అనుగుణంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
## ప్రధాని మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ
## తక్షణం అఖిలపక్షం ఏర్పాటు చేసి చర్చించాలని డిమాండ్

**న్యూఢిల్లీ, ఆగస్టు 27(ప్రభాత ఉదయం)**

లోక్‌సభ నియోజకవర్గాలను యధావిధిగా కొనసాగిస్తూ, మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. అలాగే డిలిమిటేషన్‌పై వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి, మీరు ఏమనుకుంటున్నారో చర్చించాలని కూడా అన్నారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ప్రస్తుత లోక్‌సభ ..మిగతా 2లో





## విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం
# బిజెపి అండ
## తెలంగాణలో నడుస్తున్నది పోలీస్ పాలన
## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్, ఆగస్టు 27(ప్రభాత ఉదయం)**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నడుపుతున్నది ప్రజా పాలన కాదు, పోలీసుల నిర్బంధ పాలన అని స్పష్టమవుతోందని బిజెపి విమర్శించింది. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే వివాదాస్పద జీవో 97ను ..మిగతా 2లో

## బిల్లింగ్ పూర్తి చేయాలి.. సమస్యలు పరిష్కరించి
# బకాయిలు వసూలు చేయాలి
## జలమండలి ఎండీ అశోక్ రెడ్డి




## హై ప్రయారిటీ బకాయిదారులపై ప్రత్యేక దృష్టి
## దీర్ఘకాల బకాయిదారులను అధికారులే వ్యక్తిగతంగా సంప్రదించాలి
## రెవెన్యూ వివాదాల పరిష్కారానికి సర్కిల్ స్థాయిలో కమిటీ
## ~ాX ఆధారిత రెవెన్యూ డ్యాష్‌బోర్డ్‌తో బకాయిల వసూళ్లకు మరింత బలం

**హైదరాబాద్, ఆగస్టు 27(ప్రభాత ఉదయం)**

జలమండలి పరిధిలో వంద శాతం బిల్లింగ్ పూర్తి చేయడంతో పాటు దీర్ఘకాలిక బకాయిల వసూళ్లు, బిల్లింగ్ వివాదాల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జేఎండీ మయాంక్ మిట్టల్ తో కలిసి గురువారం రెవెన్యూ పనితీరుపై ఈడీలు, డైరెక్టర్లు ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. జోన్, సర్కిల్, డివిజన్ వారీగా అన్‌బిల్డ్, అన్‌పెయిడ్ జాబీలు, డిమాండ్, కలెక్షన్ వివరాలను ప్రత్యేక రెవెన్యూ డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిశీలించారు. ఏళ్ల తరబడి బకాయిలు ఉన్నప్పటికీ కొన్ని కనెక్షన్లకు నీటి సరఫరా కొనసాగుతుండటంపై ఎండీ ..మిగతా 2లో

# జివో 97ను రద్దు చేయాల్సిందే
## హరీష్ రావు డిమాండ్

**హనుమకొండ, ఆగస్టు 27(ప్రభాత ఉదయం)**

పాలిటెక్నిక్ విద్యార్థుల పట్ల ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. హనుమకొండలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఆయనను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 97 జీవోను రద్దు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థుల ఉద్యమాలు రాహుల్ గాంధీకి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. జెన్‌జీ ఉద్యమాలపై కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి ఏంటని దుయ్యబట్టారు. అంతకుముందు హనుమకొండలోని కలెక్టరేట్ వద్ద టీఎస్జీవోలు నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని మద్దతు తెలిపారు. దీంతో ఆయన్ను పోలీసులు అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు.



## బిల్లింగ్ పూర్తి చేయాలి.. సమస్యలు పరిష్కరించి

# బకాయిలు వసూలు చేయాలి

**మొదటి పేజీ తరువాయి...**

అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి జూచీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మీటర్, బిల్లింగ్ లేదా ఇతర సమస్యలను పరిష్కరించి బకాయిలను వసూలు చేయాలని ఆదేశించారు. అలాగే బకాయిలు ఉన్నాయనే కారణంతో విచక్షణారహితంగా కనెక్షన్లు తొలగించడం సరైన పరిష్కారం కాదన్నారు. అధిక డిస్‌కనెక్షన్ల వల్ల డిస్ప్యూట్లు పెరిగి, చివరకు రెవెన్యూ వసూళ్లపైనా ప్రభావం పడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల వినియోగదారుడి సమస్యను గుర్తించి, పరిష్కరించి, రావాల్సిన మొత్తాన్ని వసూలు చేయడానికే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దీర్ఘకాలిక బకాయిల విషయంలో అధికారులే ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవాలని ఆదేశించారు. ఐదేళ్లకు పైగా బకాయి ఉంటే జీఎం, ఏడాదికి పైగా ఉంటే డీజీఎం, ఆరు నెలలకు పైగా ఉంటే సంబంధిత మేనేజర్ స్వయంగా వినియోగదారులను సంప్రదించాలని సూచించారు. బిల్లింగ్, మీటర్ లేదా ఇతర వివాదాలు ఉంటే వాటిని పరిష్కరించి వసూళ్లకు చర్యలు తీసుకోవాలన్నారు. వీటితోపాటు హై ప్రయారిటీ బకాయిదారులను గుర్తించి ఒక్కో మేనేజర్‌కు 10 జూచీల చొప్పున అప్పగించాలని, వాటిని పరిష్కరించిన తర్వాత మరో 10 జూచీలు ఇవ్వాలని సూచించారు. మూడు రోజుల తర్వాత పురోగతిని తిరిగి సమీక్షిస్తామని తెలిపారు. టాప్-10, టాప్-100 బకాయిదారుల జాబితాలను రూపొందించి క్షేత్రస్థాయి సిబ్బందికి అందించి నిరంతరం ఫాలోఅప్ చేయాలన్నారు. బల్క్ కనెక్షన్లు, మీటర్లు లేకపోవడం, పాత బిల్లులు తదితర కారణాలతో పెండింగ్‌లో ఉన్న డిస్ప్యూట్ల పరిష్కారానికి సర్కిల్ స్థాయిలో 4--5 మంది అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ వారానికి ఒక రోజు సమావేశమై కనీసం 10--15 డిస్ప్యూట్లను పరిశీలించి పరిష్కరించేలా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలన్నారు. అదేవిధంగా డాకెట్ యావరేజ్ బిల్లింగ్‌లో ఉన్న వ్యత్యాసాలను 15 రోజుల పాటు అధ్యయనం చేసి విశ్లేషణాత్మక నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.రెవెన్యూ సమీక్షలను కేవలం బిల్లింగ్, వసూళ్లకే పరిమితం చేయకుండా నీటి సరఫరా, పనుల పురోగతి, సేవా ఫిర్యాదులు, రెవెన్యూ తదితర అంశాలను సమగ్రంగా సమీక్షించాలని సూచించారు. ప్రతి స్థాయిలో అధికారులకు స్పష్టమైన బాధ్యత ఉండాలని, డేటా ఆధారంగా రోజువారీ పనితీరును పర్యవేక్షిస్తూ బిల్లింగ్, డిస్ప్యూట్ల పరిష్కారం, బకాయిల వసూళ్లలో గణనీయమైన పురోగతి సాధించాలని ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు.

**ఏఐ డ్యాష్‌బోర్డ్‌తో మరింత సమర్థవంతంగా రెవెన్యూ వసూళ్లు: జేఎండీ మయాంక్ మిట్టల్**

అధునాతన కృత్రిమ మేధస్సు (ఏఐ) పరిజ్ఞానంతో రూపొందిస్తున్న రెవెన్యూ డ్యాష్‌బోర్డ్ ద్వారా బిల్లింగ్, బకాయిలు, కలెక్షన్లు, వివాదాల, హై ప్రయారిటీ క్యాన్ లను వేగంగా గుర్తించేందుకు వీలవుతుందని ఎండీ తెలిపారు. జోన్ నుంచి వ్యక్తిగత క్యాన్ వరకు అవసరమైన సమాచారాన్ని విశ్లేషించి, ఎక్కడ బిల్లింగ్ పెండింగ్‌లో ఉంది, ఎక్కడ వసూళ్లు తక్కువగా ఉన్నాయి, ఏ కనెక్షన్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలనే అంశాలను గుర్తించేందుకు ఈ డ్యాష్‌బోర్డ్ దోహదపడుతుందన్నారు. తద్వారా అధికారులకు లక్ష్యాలను నిర్దేశించి, బకాయిల వసూళ్లను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఏఐ ఆధారిత ఈ డ్యాష్‌బోర్డ్‌ను రానున్న రోజుల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.ఈ సమీక్షా సమావేశంలో రీజనల్ డైరెక్టర్లు పంకజ, సామ్రాట్ అశోక్, సంతోష్, ఆపరేషన్ డైరెక్టర్లు నారాయణ, వాసా సత్యనారాయణ, ప్రభు, రెవెన్యూ డైరెక్టర్ కిరణ్ కుమార్, సీజీఎంలు, జీజీఎంలు, రెవెన్యూ, ఐటీ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మిల్లర్లో గుబులు రేపుతున్న సీఎంఆర్ ధాన్యం

**సీఎంఆర్ దుర్వినియోగం కేసులో నందిన్నెలోమి రైస్ మిల్లర్ పై కేసు నమోదు, లిమిల్లు నిర్వాహకుడు అరెస్టు**

**ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని ఇచ్చినట్లే**

**అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్న వైనం**

**బకాయిల జాబితాలో మరికొన్ని మిల్లులు**

**చాలా రైస్ మిల్లుల్లో దాన్యం నిల్వలు లేకున్నా అధికారులు పట్టించుకోని వైనం**

**గద్వాల ప్రతినిధి, ఆగస్టు27 (ప్రభాత ఉదయం)**



రైతుల నుంచి ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించడం, రైస్‌మిల్లర్లు వాటిని మర ఆడించి బియ్యం ఇవ్వకుండా.. తమకిచ్చిన ధాన్యాన్ని ఇచ్చినట్లే అమ్ముకోవడం జోగుళాంబ గద్వాల జిల్లాలో నిత్య కృత్యంగా మారిపోయింది. రైస్ మిల్లర్ల అక్రమ దందాకు సివిల్ సప్లయ్ అధికారులు, రాజకీయ నాయకులు అండదండలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో మిల్లర్లు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా తయారైంది. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా సంవత్సరాల నుంచి చాల రైస్ మిల్లులు మొండి బకాయిలు పేరుకుపోయాయి. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ను ప్రభుత్వానికి అప్పజెప్పకుండా, మింగిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు చెల్లించకుండా రైస్‌మిల్లర్లు దొంగాట ఆడుతున్నారు. రైతుల నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొని.. రైస్‌మిల్లులకు కేటాయిస్తుంది. రైతుల నుంచి ధాన్యా న్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొని.. రైస్‌మిల్లులకు కేటాయిస్తుంది. మిల్లర్లు వాటిని బియ్యంగా మార్చేందుకు కేవలం జాబ్‌వర్క్ (అద్దెపని) మాత్రమే చేయాలి. ఇందుకుగాను ప్రభుత్వం మిల్లింగ్ చార్జీలు చెల్లిస్తుంది. వడ్లు గానీ, బియ్యం గానీ అమ్ముకునే అధికారం రైస్‌మిల్లర్లకు లేదు. ప్రభుత్వం ఇచ్చిన నిర్ణీత గడువులో ధాన్యాన్ని మర ఆడించి బియ్యం అప్పజెప్పాలి. కాని జిల్లాలో రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం పక్కదారి పడుతోంది. ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎక్కువ ధరకు ధాన్యాని విక్రయించి మిల్లర్లు కోట్లకు పడగెత్తారు. రైస్ మిలుల్లకు కేటాయించిన ధాన్యం ఏ ఏ రైస్ మిల్లులో ఎంత నిల్వ ఉందో జిల్లా పౌరసరఫరాల అధికారులు ఏ నాడు తనిఖీలు చేసిన పాపాన పోలేదు. జిల్లాలోని గద్వాల , ఇటిక్యాల, ఉండవెల్లి, అయిజ మండలాలోని రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం నిల్వలు బ్లాక్ మార్కెట్ కు తరలించినట్లు, పైగా అధికారుల నోటీస్‌లో ఉన్నట్లు సమాచారం. రైస్ మిల్లర్లకు అధికారులు, రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతోనే ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. కాగ ఇటీవల జిల్లాలో రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతోంది. రైస్ మిల్లర్లు ఎఫ్ సీఐ కి అప్పజెప్పే బియ్యం కు బదులు రేషన్ డీలర్లు, అక్రమార్కుల నుంచి కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని ఎఫ్ సీఐ కి కేటాయిస్తున్నట్లు ఇటీవల రేషన్ బియ్యం అక్రమార్కులు బహిరంగానే చెప్పుకోవడం చర్చనీయాంశంగా మారింది.

**నందిన్నెలోని శ్రీకమ్మిడి స్వామి రైస్ మిల్లుపై కేసు నమోదు**

ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం అయినట్లు కేటిదొడ్డి మండలం నందిన్నెలోని శ్రీకమ్మిడిస్వామి రైస్ మిల్లుల నుంచి ధాన్యం పక్కదారి పట్టిందని హైకోర్టు ఉత్తర్వులు మేరకు, రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్ కమీషనర్ అదేశాల మేరకు సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ (ఎన్ఫోర్స్మెంట్) , కాలూర్ తిమ్మన్ దొడ్డి, రీజినల్ విజిల్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మరియు టెక్నికల్ అసిస్టెంట్లతో కలిసి కమ్మిడిస్వామి రైస్ మిల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించి ఈనెల 17 న జిల్లా కలెక్టర్ కు సమర్పించిన నివేదిక ప్రకారం భారీగా ధాన్యం కొరత (తగ్గుదల) ఉన్నట్లు రూ.40.70 కోట్లకు పైగా ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టడంతో కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు.

2022-23 రభి సీజన్లో ప్రభుత్వం 1,425.520 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించింది. దీనికి బదులుగా 355.749 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ (జవీ=) ప్రభుత్వానికి అందజేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో 1,069.771 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి బకాయి ఉన్నట్లు తేలింది. కాగ 2022-23 రబి సీజన్ కు సంబందించి 552.640 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లుల నుంచి పక్కదారి పట్టినట్లు సివిల్ సప్లయ్ అధికారులు గుర్తించారు. అలాగే 2024-25 ఖరీఫ్ సీజన్ కు 5,948.560 మెట్రిక్ టన్నులు కేటాయించగా 1,079.664 మెట్రిక్ టన్నులు మాత్రమే అందించగా 4,868.896 మెట్రిక్ టన్నులు పెండింగ్ లో ఉన్నాయి. మిల్లు నుంచి 4,315.240 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు అధికారుల విచారణలో తేలింది.

అలాగే 2024-25 రభి సీజన్ కు 10,380.160 మెట్రిక్ టన్నులు మిల్లుకు కేటాయించగా 1,253.903 మెట్రిక్ టన్నులు మాత్రమే సీఎంఆర్ రైస్ అందించగా 9,126.257 మెట్రిక్ టన్నులు పెండింగ్ లో ఉన్నాయి. మిల్లు నుంచి 7,775.160 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు అధికారుల విచారణలో తేలింది. సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ విమల ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో రైస్ మిల్ ప్రాంగణంలో ప్రభుత్వానికి సంబంధించిన ధాన్యం నిల్వలు కూడా కనిపించలేదని అధికారులు వెల్లడించారు. దీంతో ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారించి చర్యలకు ఉపక్రమించారు. ఒప్పంద నిబంధనల 2022-23, 2024-25, 2024-25 సీజన్ కు సంబందించి 12,643.40 మెట్రిక్ టన్నుల ధాన్యం బకాయి ఉన్నట్లు రూ.40,70,82,947.00 ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు లెక్కించారు. ఈ వ్యవహారంపై శ్రీ కమ్మిడిస్వామి రైస్ మిల్ యజమాని కుర్వ వీరన్నపై కేటిదొడ్డి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. పాతపాలెం ప్రభుత్వం ధాన్యం నిల్వ గోధాంలో గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య, కేటిదొడ్డి ఎస్ఐ పి.శ్రీనివాసులు, సివిల్ సప్లయ్ అధికారులు తనికీలు చేపట్టారు. మిల్లు ఓనర్ కుర్వ వీరనన్న అరెస్టు చేశారు.

**సివిల్ సప్లయ్ అధికారుల పాత్రపై అనుమానం**

2023, 2024, 2025 ధాన్యం కేటాయింపులపై పోలీసులు ఆ శాఖలోని కీలక ఉద్యోగుల పాత్రపై జిల్లా పోలీస్ అధికారులు విచారించినట్లు సమాచారం. సివిల్ సప్కయ్ అధికారులు తీసుకున్న చర్యలు, తని ఖీలు, నివేదికలపై ఆరా తీశారు. ఎన్ఫోర్స్మెంట్, విజెలెన్స్ అధికారుల నిఘా ఉన్నప్పటికీ మిల్లు నిర్వాహకుడు ప్రభు త్వాన్ని మోసం చేసిన తీరుపై అనుమానాలు వ్యక్తమవడంతో సివిల్ సప్లయ్ అధికారుల పాత్రనే కీలకంగా మారనున్నది.బయటపడుతున్న మరికొన్ని మిల్లుల వ్యవహారం జిల్లాలో 40 రైస్ మిల్లులకు ప్రభుత్వం రైతుల నుంచి వడ్లను సేకరించి ఇస్తే వాటిని మిల్లర్లు మరాడించి రైస్ ఇవ్వాలి. అయితే గద్వాల, ఇటిక్యాల, ఉండవెల్లి, అయిజ మండలాలో పలు రైస్ మిల్లుల్లో భారీ సంఖ్యలో మిల్లర్లు వడ్లను, బియ్యాన్ని అమ్మేసుకున్నట్లు తెలుస్తోంది. నేటికి ఆ మిల్లులో పలు సీజన్ కు సంబంధించి దాన్యం నిల్వలు ఉండకపోవడం, ఇదంతా జిల్లా సివిల్ సప్లయ్ అధికారుల కనుసన్నాలలో నడుస్తున్నట్లు ప్రచారం. నిజానికి ఈ అక్రమాల్ని ఎప్పటికప్పుడు గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అధికారుల నిర్లక్ష్య ధోరణి, మిల్లర్లతో మిలాఖత్ అవడం ప్రభుత్వానికి నష్టం తెచ్చిపెడుతోంది. మిగత రైస్ మిల్లర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో లేదో వేచి చూడాలి.



## రూ.40.70కోట్ల విలువైన ధాన్యం పక్కదారి కేసులో మిల్లర్ రిమాండ్ తరలింపు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు27 (ప్రభాత ఉదయం)**

2022-23 రబి, 2024-25 ఖరీఫ్,2024-25 రబి సం బంధించి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన 12643.040 మెట్రిక్ టన్నుల ధాన్యం రూ.40.70 కోట్ల విలువైన సీఎంఆర్ దుర్వినియోగం చేసిన కేటిదొడ్డి మండలం నందిన్నెలోని శ్రీకమ్మిడి స్వామి రైస్‌మిల్లు నిర్వాహకుడు కుర్వ వీరన్నపై కేసు న మోదు చేసి, రిమాండ్ కు తరలించినట్లు గద్వాల డీఎస్పీ వై.మొగులయ్య తెలిపారు. గద్వాల డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నందిన్నె గ్రామంలోని శ్రీకమ్మిడి స్వామి రైస్ ఇండస్ట్రీస్‌లో రూ.40.70 కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి సీఎంఆర్ దుర్వినియోగం చేశారని జిల్లా పౌరసరఫరాల మేనేజర్ విమల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు.

## విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం

# బిజెపి అండ

**మొదటి పేజీ తరువాయి...**

రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్క్, మాసాబ్‌ట్యాంక్, రామంతపూర్ నుంచి మొదలుకొని వనపర్తి, పరకాల దాకా విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా రోడ్డెక్కితే.. వారిపై లాఠీఛార్జీలు చేయించడం, అరెస్టులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపింది. రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల న్యాయమైన ఆందోళనకు మద్దతు తెలపడానికి వెళ్తున్న మా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తో పాటు పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయించడం కాంగ్రెస్ పిరికితనానికి నిదర్శనం. చేతిలో రాజ్యాంగ పుస్తకం పట్టుకుని దేశమంతా తిరిగే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పాలిత తెలంగాణలో విద్యార్థుల హక్కులను కాలరాస్తుంటే ఎందుకు కనిపించడం లేదన్నారు. పాలిటెక్నిక్ సాంకేతిక విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, విద్యార్థులకు ఉన్నత విద్య (ఈసెట్) అవకాశాలను దూరం చేసే కుట్రలను రేవంత్ రెడ్డి సర్కార్ తక్షణమే విరమించుకోవాలి. కంటితుడుపు కమిటీలతో కాలయాపన చేయకుండా వివాదాస్పద జీవో 97ను వెంటనే బేషరతుగా రద్దు చేయాలి. తెలంగాణ విద్యార్థుల న్యాయమైన హక్కుల సాధన కోసం భారతీయ జనతా పార్టీ అండగా నిలబడి చివరిదాకా రాజీలేని పోరాటం చేస్తుంది.

## యధావిధిగా లోక్‌సభ నియోజకవర్గాలు మరో 25 ఏళ్లపాటు యధావిధిగా కొనసాగాలి

**మొదటి పేజీ తరువాయి...**

స్థానాల సంఖ్య 543 మరో 25 ఏళ్లపాటు ఇలాగే ఉండాలని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో డీలిమిటేషన్‌కు సంబంధించిన సవరించిన బిల్లును మళ్లీ ప్రవేశపెట్టనున్నారనే వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల్లోనూ ఎలాంటి మార్పులు చేయొద్దని సూచించారు. డీలిమిటేషన్ దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపే అత్యంత కీలకమైన విషయమని తెలిపారు. దీనిపై నిర్ణయం తీసుకునే ముందు అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాల అభిప్రాయాలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. జనాభా నియంత్రణకు కృషి చేసిన రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా రాజ్యాంగపరమైన రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా విస్తృత రాజకీయ సంప్రదింపులు జరపాలన్నారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై చర్చించేందుకు సర్వపక్ష సమావేశం నిర్వహించాలని, రాజకీయ పార్టీలు ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించేందుకు తగిన సమయం ఇవ్వాలని ఆయన కోరారు. రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026 ఏప్రిల్ 17వ తేదీన లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని సాధించలేక పోయిందని పేర్కొన్నారు. అటువంటి విధానాన్ని మళ్లీ పునరావృతం చేయవద్దని కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ఎలాంటి నిర్ణయానికైనా కాంగ్రెస్, విపక్ష కూటమి మద్దతు ఇవ్వబోదని ఖర్గే తేల్చి చెప్పారు. లోక్‌సభ స్థానాలను పెంచేందుకు కేంద్రం ప్రయత్ని స్తోందని, ఇది కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమేనని ఆరోపించారు. మహిళలకు చట్టసభల్లో కల్పించే 33 శాతం రిజర్వేషన్లను డీలిమిటేషన్ ప్రక్రియతో ముడిపెట్టడాన్ని ఖర్గే తప్పుపట్టారు. ఈ అంశంపై తాను గతంలో జులై 16న కూడా లేఖ రాశానని, కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సానుకూల స్పందన రాకపోవడంతో తాజా పరిణామాల నేపథ్యంలో మోదీకి మళ్లీ లేఖ రాయాల్సి వచ్చిందని ఖర్గే పేర్కొన్నారు.

# రాఖీట్ల పండుగ సందడి

**గద్వాల జిల్లాలో రాఖీ పండుగ సందడి నెలకొంది**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు27 (ప్రభాత ఉదయం)**



అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను పవిత్రంగా భావిస్తారు. ఇది శుక్రవారం రావడంతో గురువారం నుంచే రాఖీల కొనుగోలుకు యువతులు, మహిళలు పెద్ద ఎత్తున జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలకు రావడంతో సందడిగా మారింది. గద్వాల పట్టణం కొత్తబస్టాండ్, క్రిష్ణవేణి చౌరస్తా, పాతబస్టాండ్, షేరెల్లీ వీధి, గాంధీచౌక్, తదితర ప్రాంతాల్లో ప్రత్యేకంగా రాఖీల దుకాణాలు వెలిశాయి. చిన్న పిల్లల నుంచి యువతులు, మహిళలను ఆకర్షించే రాఖీలను వ్యాపారులు అందుబాటులో ఉంచారు. రూ. 10 నుంచి రూ.500 దాకా ధరలున్నాయి. పట్టణ వాసులతో పాటు నియోజక వర్గంలోని ధరూర్, కేటిదొడ్డి, మల్దకల్, అయిజ, ఎర్రవల్లి చౌరస్తా మండలాల గ్రామాల ప్రజలు రాఖీలు కొనుగోలతో వినియోగదారులతో వ్యాపార దుకాణాలు ఉదయం నుంచే కిటకిటలాడాయి. చిన్నారులు, యువతులు, మహిళలు రాఖీ దుకాణాల వద్ద బారులు తీరారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో స్వీటు షాపులు కూడా కళకళలాడుతున్నాయి.

# గద్వాలలో పోలీసుల కార్డెన్ సెర్చ్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు27 (ప్రభాత ఉదయం)**





గద్వాల పట్టణ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం వద్ద జిల్లా ఎస్పీ టి.శ్రీని వాస రావు ఆదేశాల మేరకు గురువారం గద్వాల సీఐ టి.శ్రీను ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో 50 మంది పోలీసు సిబ్బంది ఇంటింటికి వెళ్లి విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సెర్చ్‌లో భాగంగా సరైన పత్రాలు లేని 7 ద్విచక్ర వాహనా లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ టి.శ్రీను మాట్లాడుతూ.. వాహనాలకు సంబంధించి లైసెన్సులు, ఇతర పత్రాలు లేకుండా వాహనాలను రోడ్లపై నడపకూడదన్నారు. గంజాయి తదితర మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం నేరమన్నారు. ఆన్‌లైన్‌లో జరిగే మోసాల జోలికి వెళ్లొద్దని సూచించారు. మహిళలు, చిన్న పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఆపద సమయంలో వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం డయల్ 100 ప్లేస్ లో కొత్తగా డయల్ 112 ను తెలంగాణ పోలీసు వారు తీసుకురావడం జరిగిందన్నారు. డయల్ 112కు సమాచారం ఇవ్వడం వల్ల పోలీస్, అంబులెన్స్, ఫైర్ మూడు శాఖలు ఏకకాలంలో అవసరాన్ని బట్టి, చాలా తక్కువ సమయంలో ప్రజలకు సేవలందిస్తాయని తెలిపారు. ప్రజల రక్షణ కొరకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. కాలనీలో స్వీయ రక్షణ కోసం స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గద్వాల్ రూరల్ సిహెచ్ శ్రీకాంత్ సూచించారు. ఈ కార్యక్రమంలోగద్వాల్ సర్కిల్ ఎస్ఐలు శ్రీహరి, శ్రీకాంత్, కళ్యాణ్ కుమార్, నందికర్, శేఖర్ గౌడ్, జహంగీర్, సర్కిల్‌హా కానిస్టేబుళ్లు, ఏ.ఆర్. కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

# చిన్న చిన్న పొరపాట్లకు నోటీసులు...విస్తుపోతున్న ఓటర్లు


బాబుల్ రెడ్డి నగర్ బస్తీ సభలో ఓటర్లకు నోటీసులు అందచేస్తున్న మాజీ కౌన్సిలర్, బి ఆర్ ఎస్ కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్


ఉప్పర్ పల్లి లో అధికారులతో మాట్లాడుతున్న హైదర్ గూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామ ఇంద్రపాల్ రెడ్డి


లక్ష్మీ గోడలో నోటీసులు తీసుకుంటున్న ఓటర్లు


హైదర్ గూడ జనప్రియ అపార్ట్ మెంట్ వద్ద....

**బుద్వేల్, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం)**

ఓటరు జాబితా నమోదు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో బాగంగా మ్యాపింగ్ చేసుకోని ఓటర్ల తో పాటు పేర్లు, అడ్రస్ తప్పుగా ప్రచురితమైన ఓటర్లకు నోటీసులు ఇచ్చి వారి ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని అన్ని డివిజన్లలో గురువారం బస్తీ సభలు ఏర్పాటు చేశారు. హైదరూడ, అత్తాపూర్, సులేమాన్నగర్, శాస్త్రీపురం, మైలార్దేవుపల్లి, కాటేదాన్ డివిజన్లలో డివిజన్ కు ఆరు చొప్పున బస్తీ సభలను ఏర్పాటు చేశారు.

**చిన్న చిన్న పొరపాట్లకు కూడా నోటీసులు**

మ్యాపింగ్ చేసుకోని ఓటర్లకు నోటీసులు అందజేస్తున్నారు. అదే సమయంలో 2002 నాడు ఓటు ఎక్కడ వేశారో.. తెలుపకుంటే నోటీసులు ఇస్తున్నారు. ఇవి కాకుండ పేరులో రావు అన్న దగ్గర ఆర్ఎఓ ఉండకుండ ఆర్ఏ ఉన్నా నోటీసు ఇస్తున్నారు. ఇంటిపేరు లో ఉన్న అక్షరం ఎ కు బదులు ఇ పడిన నోటీసులు ఇస్తున్నారు . ఇవన్ని కంప్యూటర్ మిస్టేక్ తో అయిన తప్పులయినప్పటికీ మాకు నోటీసులు ఇవ్వడం ఏంటని పలువురు ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. 2002 నాడు ఓటు వేయకపోతే 1987 కంటే ముందు ఉన్న ధృవ పత్రం ఏదైన అడుగుతున్నారని, అవి మా దగ్గర ఎలా ఉంటాయని చదువుకోని వారు ప్రశ్నిస్తున్నారు. చదువుకున్న వారి వద్ద సర్టిఫికెట్లు ఉంటాయని, అదే చదువుకోలేని వారు ఎలాంటి ధృవ పత్రాలు కలిగి ఉండరని గుర్తు చేస్తున్నారు.

**బస్తీ సభలు నిర్వహించిన ప్రాంతాలలో ఎలాంటి సౌకర్యాలు లేవు :**

బస్తీ సభలు నిర్వహించిన ప్రాంతాలలో మంచినీటి సౌకర్యం కానీ, మూత్రశాలలు కానీ లేవు. దీంతో అక్కడికి వచ్చిన ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.



## నోటీసులు అందుకున్న ఓటర్లు ఆధారాలతో హాజరు కావాలి

**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన సదస్సు..**

**మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్**

**రాజేంద్రనగర్,ఆగస్టు27(ప్రభాత ఉదయం)**

ప్రతి ఓటు హక్కును కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని మాజీ కౌన్సిలర్, కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రెండో దశపై కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్‌లో పార్టీ ప్రతినిధులు,అధికారులతో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ కౌన్సిలర్,కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ...రానున్న 24రోజుల్లో అధికారులు జారీ చేసే నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు వాటికి అనువైన పత్రాలను వీలైనంత త్వరగా జతచేసి తమ ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రతి బూత్ స్థాయి ఏజెంట్ ఓటరు జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.ఓటు హక్కు లేని అర్హులైన వారిని గుర్తించి కొత్తగా ఓటర్లుగా నమోదు చేయించాలని,అనుమానాస్పద ఓటర్లు ఉన్నట్లయితే ఫారం-7ద్వారా అభ్యంతరాలు నమోదు చేయాలని సూచించారు.బూత్ స్థాయి ఏజెంట్లు,బూత్ స్థాయి అధికారులతో కలిసి ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాలను పరిశీలించాలని కోరారు.ప్రతి ఓటరు హక్కును పరిరక్షించే బాధ్యత ఏజెంట్లపై ఉందని గుర్తుచేశారు. నాయకులు,కార్యకర్తలు ఏజెంట్లతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు అనుమానాస్పద ఓటర్లను గుర్తించడంతో పాటు ఎప్పటికప్పుడు ఓటరు జాబితాలను పరిశీలిస్తూ సవరణ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ రాఘవరెడ్డి,విజయేందర్,వీడం రమేష్,ప్రకాష్, నాగమణి, మాధవి,అనిత,కనకవ్వ,సుజాత,హేమలత,భానుప్రియ,సంధ్య,నాగమణి,మాధవి, గీతతో పాటు బీఆర్ఎస్ బూత్ స్థాయి ఏజెంట్లు ఉప్పల్ శ్రీనివాస్,అశోక్ కుమార్,కిష్టప్ప, రామకృష్ణ,పుష్ప,పద్మ,తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ లోని ఏ ఆర్ ఐ ధర్నా చౌక్ వద్ద ఉద్యోగుల నిరసన



వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలన భవనం వద్ద నిరసనలో పాల్గొన్న ఉద్యోగులు


జి పరమేశ్

### ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలంటు

# రాజేంద్రనగర్‌లో ధర్నాలు, నిరసనలు

**బుద్వేల్, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, ఫెన్షనర్ల కు రావాల్సిన అన్ని సౌకర్యాలు అందజేయాలని డిమాండ్ చేస్తు గురువారం రాజేంద్రనగర్ తాలుకా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ ఎం శ్రీనివాస్ యాదవ్, కో చైర్మన్ ఎస్ యాదయ్య ముదిరాజ్ ల ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఏఆర్ తెలంగాణ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పీఆర్సీ ని ఇవ్వాలని, ఆరు డీఏ లను విడుదల చేయాలని, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ను అమలు పరచాలని, జీపీఎఫ్, టీఎసీఎస్ఐ, మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులను త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ను రద్దు చేసి ఉద్యోగులందరికి ఓపీఎస్ ను పునరుద్ధరించాలన్నారు. జీవో 190 ను అమలు చేయాలన్నారు. పెండింగ్ బిల్లులన్నింటిని మంజూరు చేయాలన్నారు. విశ్వవిద్యాలయాలలో ప్రమోషన్లు ఇవ్వాలని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు ఎం. రాజు, ఎస్ జయరాం, దార రాములు, సురేశ్, ఎస్ నజీర్, జి పరమేశ్, సులోచన, కె ప్రవీణ్ కుమార్, సంజీవరెడ్డి, రవిందర్ రెడ్డి, ఎస్ రమేశ్, కోరని కుమార్, బిక్షపతి, ఖలీల్, మురళి, అశోక్, జహంగీర్, సీనయ్య, ముత్యాలు, రాజుగౌడ్, శ్రీను, శ్రీశైలం, బాబురావు, అశోక్, బాలరాజు, రమ్య, రజిత, నవ్య, నవిత, తదితరులు పాల్గొన్నారు.

**పశువైద్య విశ్వవిద్యాలయంలో...**

పశువైద్య విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మహ్మద్ షర్ఫుద్దీన్ ఆధ్వర్యంలో వర్శిటీ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల సౌకర్యాలను ప్రభుత్వం అందజేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో నాయకులు జి అంజనేయ లు, టి నర్సింహ్మ, డి నిరంజన్, ఎన్ అంజనేయులు లు పాల్గొన్నారు.

**శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో...**

ఉద్యాన విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పోతురాజు యాదయ్య, ప్రధాన కార్యదర్శి చెంచు రామయ్య ల ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలపై నిరసన కార్యక్రమ ం నిర్వహించారు. పీఆర్ సీ ని అమలు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఆరు డీఏ లను విడుదల చేయాలన్నారు. సీపీఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ ను అమలు చేయాలన్నారు. నిరసన కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు టి కుమార్, కె రాజేశ్వరి, ఎం రజనీకాంత్, ఎన్ రత్నం, ఎం రత్నకాంత్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో..**

రాజేంద్రనగర్ లోని మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగులు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల నుంచి వర్శిటీ పరిపాలన భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరి పాలన భవనం వద్ద తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు మజ్జిగ శ్రీనివాస్ యాదవ్, నాయకులు ఎస్ కె నజీర్, రవీందర్రెడ్డి, పరమేశ్, సంజీవరెడ్డి తో పాటు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ ను అమలు చేయాలి : జి పరమేశ్, సంయుక్త కార్యదర్శి, వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ :**

సీపీఎస్ ను రద్దు చేసి ఉద్యోగులందరికి ఓపీఎస్ ను పునరుద్దరిస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఓపీఎస్ ను పునరుద్దరించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జి పరమేశ్ కోరారు. సీపీఎస్ ను ఓపీఎస్ గా మారుస్తామని హామీ ఇవ్వడం వల్లనే వేలాది మంది ఉద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ప్రకటించి గెలిపించుకున్నారని ఆయన గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక మా సమస్యకు పరిష్కారం లభిస్తుందని బావించామని, అయితే ఆ సమస్య అలాగే ఉండిపోవడం వల్ల ఉద్యోగులు మనో వేధనకు గురైతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగులందరిని ఓపీఎస్ లోకి మార్చాలన్నారు.


సిద్దిపేట ములుగు లో గల శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆవరణలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు



రాజేంద్రనగర్ లోని పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ముందు నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## విద్యుత్‌శాఖ అధికారుల 'ప్రజా బాట' కార్యక్రమం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు27 (ప్రభాత ఉదయం)**

గద్వాల పట్టణంలో విద్యుత్ శాఖ అధికారులు గురువారం ప్రజా బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. విద్యుత్ కనెక్షన్ల సమస్య ఉన్నచోట వాటిని పరిశీలించి పరిష్కరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్ సి అబ్దుల్ కరీమ్ మాట్లాడుతూ... ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజలకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్‌ను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డిఇ రవిప్రసాద్, ఎడి రమేష్ బాబు, ఎఇ శివకుమార్, లైన్ మెన్లు, తదితరులు పాల్గొన్నారు.



# గట్టులో రెచ్చిపోతున్న గుప్త నిధుల ముఠాలు




**మూడు నెలలో నాలుగో సారి తవ్వకాలు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు27 (ప్రభాత ఉదయం)**

గట్టు మండల కేంద్రంలో గత కొన్ని నెలలుగా గుప్త నిధుల వేట ఆగడం లేదు. గుప్తనిధుల కోసం కొందరు వ్యక్తులు గట్టు మండల కేంద్రంలో గుట్టుగా తవ్వకాలకు పాల్పడుతున్నారు. పాడు బడిన ఆలయాలు, గుట్టలు, పరిసరాల్లో విగ్రహాలను ధ్వంసం చేస్తూ పొక్లెయిన్లతో అడ్డగోలుగా తవ్వేస్తుండటం స్థానికంగా ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.గుప్త నిధుల ముఠాలు బరి తెగించి యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతుండటం గట్టు మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో గట్టు మండల కేంద్రంలోనిబిచ్చల పేటలో రెండు సార్లు తవ్వకాలు జరిపడంతో భారీ ఎత్తున నిధులు దొరికినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. అదే విధంగా నేతాజీ సర్కిల్ సమీపంలో ఇంటి గోడ కూలుస్తుండగా కూలీలకు దొరికిన గుప్త నిధుల వ్యవహారం ఓ కొలికి వచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో నిధులను స్వాధీనం చేసుకోలేదని అధికారులపై విమర్శలున్నాయి.



తాజాగా ప్రభుత్వ హైస్కూల్ వెనుకాల ఉన్న గుట్టపై గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ క్షుద్ర పూజలు నిర్వహించి తవ్వకాలు చేపట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. మంగళవారం ఉదయం ఆ ప్రాంతానికి వెళ్లిన స్థానికులు గొయ్యిని చూసి నిర్ఘాంతపోయారు. గట్టు మండల కేంద్రంలో వరసగా గుప్తనిధుల తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ్లలో పోలీసుల గస్తీ ముమ్మరం చేయకపోవడం, నిఘా ఉంచకపోవడం వల్లే ముఠాలు మరింతగా రెచ్చిపోతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

## గుట్కా లోడ్‌తో ఉన్న లారీ పట్టివేత

**బుద్వేల్, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం) :**


గుట్కా బ్యాగు లున్న లారీ

పల్లెచెరువు ఉడంగడ్డ సమీపంలో గల జీఎంఆర్ పార్కింగ్ లో రెండు రోజులుగా పార్క్ చేసి ఉన్న ఎంహెచ్ 10 డీటీ 4563 నెంబరు లారీ లో పెద్ద మొత్తంలో గుట్కా ప్యాకెట్లను మైలార్దేవుపల్లి పోలీసులు గురువారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ లారీ ని ఎవరు పార్కింగ్ చేశారో తెలియరాలేదు. అనుమానస్పద స్థితిలో ఆపి ఉన్న లారీ గురించి స్థానికులు మైలార్దేవుపల్లి పోలీసులకు సమాచారం అందించారు. లారీ లో 52 బ్యాగుల గుట్కా ను గుర్తించారు. ఒక్కో బ్యాగులో 50 కిలోల గుట్కా ఉంటుందని పోలీసులు గుర్తించారు. ఈ సంఘటన లో సయ్యద్ అన్వర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుట్కా ఎక్కడి నుంచి తీసుకువచ్చారు.. దీని వెనుక ఎవరున్నదనే విషయంలో ధర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నేపాలి యువకుని హత్య చేసిన యువకుడు అరెస్ట్

**బుద్వేల్, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం)**


మహ్మద్ సుఫియాన్ సోహిల్ ఫరాష్

ఈ నెల 24న అర్ధరాత్రి 12 గంటల సమయంలో నడుచుకుం టు వెళుతున్న నేపాలి యువకుణ్ణి సెల్ ఫోన్ కోసం హత్య చేసిన సంఘటన లో ఒక పాత నేరస్థునితో పాటు ఓ మైనర్ ను అరెస్ట్ చేసారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలను ఇన్స్పెక్టర్ ఆర్ వెంకటేశ్ వెల్లడించారు. నేపాల్ కు చెందిన నాగేంద్ర మారీ (23) ఈ నెల 24న రాత్రి 12 గంటలు సమయంలో గోల్డెన్ హైట్స్ కాలనీ గూండా తన ఇంటికి నడుచుకుంటు వెళుతున్నాడు. యాక్టీవా ద్విచక్ర వాహనంపై అతన్ని వెంబండించిన అదే ప్రాంతానికి చెందిన పాత నేరస్థుడు మహ్మద్ సుఫియాన్ సోహిల్ పరాష్ (21) , మరో మైనర్ బాలుడు నాగేంద్ర మాజీ సెల్ఫోన్ ను లాక్కొవడానికి ప్రయత్నించగా అతను అడ్డుకున్నాడు. ఈ సందర్భంగా మహ్మద్ సుఫియాన్ సోహిల్ ఫరాష్ అతన్ని కణత పై కొట్టడంతో క్రింద పడిపోయి మరణించాడు. సెల్ ఫోన్ ను తీసుకుని నిం దితులు పారిపోయారు. సీసీ ఫుటేజీల సహాకారంతో నిందితులను అరెస్ట్ చేసిన రాజేంద్రనగర్ పోలీసులు వారి నుంచి ఒక యాక్టివా ద్విచక్ర వాహనం, ఒక మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుని రిమాండ్ కు తరలించారు. మైనర్ బాలున్ని జువనైల్ హోమ్ కు తరలించి న పోలీసులు కేసు ను దర్యాప్తు చేస్తున్నారు.

## హిమాయత్ సాగర్ ఔటర్ రింగు రోడ్డుపై మూడు కార్లు ఢీ

**బుద్వేల్, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం)**


గాయపడ్డ మహిళ కు వైద్యం అందిస్తున్న సిబ్బంది

గచ్చిబౌళి నుంచి శంషాబాద్ వైపు ఔటర్ రింగ్ రోడ్డు పై వెళుతున్న మూడు కార్లు హిమాయత్ సాగర్ తెలంగాణ పోలీస్ అకాడమీ సమీపంలో ఒకదానికొకటి ఢీ కొనడంతో నలుగురికి స్వల్ప గాయాలైనాయి. కార్లు పాడైపోయాయి. సమాచారం అందుకున్న వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ వారికి ప్రదమ చికిత్స అందించారు. ప్రమాదానికి గురైన కార్లను రోడ్డుపై నుంచి తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

## నిశ్చితార్థం రద్దవడంతో ఓ యువతి ఆత్మహత్య

**బుద్వేల్, ఆగస్టు 27 (ప్రభాత ఉదయం)**

: నిశ్చితార్థం రద్దయిందని మనస్థాపానికి గురైన ఓ యువతి ఇం ట్లో ప్యాను కు చీర తో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బండ్లగూడ ఎన్ఎఫ్సీ కాలనీలో బుధవారం జరిగింది. ఎస్ఐ షమా నూర్ కథనం ప్రకారం వివరాలు ఈ విదంగా ఉన్నాయి.. వికారాబాద్ కు చెందిన కె నర్సింహులు కుటుంబం కొంతకాలంగా బం డ్లగూడ ఎన్ఎఫ్సీ కాలనీ లో నివాసం ఉ ంటుంది. ఇటీవల ఆయన కూతురు కె సంగీత కు నిశ్చితార్థం అయి రద్దయింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్యాను కు చీర తో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ షమా నూర్ ధర్యాప్తు చేస్తున్నారు.

